క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



నారాయణ కుమారుడికి రూ.20 వేలు అందజేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల: మండలంలోని బొందలవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బూసి నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నారై కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గాయపడిన నారాయణ కుమారుడికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. మీ కుటుంబానికి అండగా ఉంటాను.. అధైర్య పడకండని మహేష్‌కు ఆయన భరోసా కల్పించారు.

కాన్సర్ రోగికి ఆర్థిక సాయం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన మల్లికార్జున కాన్సర్ వ్యాధి బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక అవసరాల దృష్ట్యా ఆయన కుటుంబ సభ్యులకు ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి రామేశ్వరెడ్డి, కన్వీనర్ శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోట అద్భుతం



గుత్తి కోటను సందర్శించిన జిల్లా ఖజానా అధికారిణి రాణి, కుటుంబ సభ్యులు

గుత్తి: గుత్తి కోట చాలా అద్భుతంగా ఉందని జిల్లా ఖజానా అధికారిణి రాణి అన్నారు. గుత్తి కోటను ఆదివారం ఆమె కుటుంబ సభ్యులతో కలసి సందర్శించారు. కోటలోని మన్రో సమాధి, ఏనుగు శాలలు, గుర్రపు శాలలు, రాణి మహల్, మురారి గద్దె, చీకటి గదులులను పరిశీలించారు. గైడ్ రమేష్, కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్ గుత్తి కోట చరిత్ర, ప్రాశస్త్యాన్ని వివరించారు.

తప్పిపోయిన యువకుడి అప్పగింత



మహేష్‌ను తల్లికి అప్పజెప్పిన జీఆర్‌పీ పోలీసులు

గుంతకల్లు: ఇంటి నుంచి వచ్చేసిన ఓ మతి స్థిమితం లేని యువకుడిని తల్లికి అప్పగించినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి, అనంతపురానికి చెందిన మాల మహేష్ అనే యువకుడికి మెంటల్ కండిషన్ సరిగా లేక తరచూ ఇంట్లో చెప్పకుండా రైళ్లు ఎక్కి ఎక్కడికంటే అక్కడకు పోతూ తిరిగి వస్తూంటాడు. ఈక్రమంలో శనివారం అనంతపురం నుంచి కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రైలులో అనుమానస్పదంగా కనబడిన మహేష్‌ను తమ సిబ్బంది విచారించి గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో దింపారు. అనంతరం అతడి తల్లిని గుంతకల్లుకు పిలిపించి మహేష్‌ను అప్పజెప్పినట్లు ఆయన వివరించారు.

మునిసిపల్ కార్మికుల నిరసన



దీక్ష చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

తాడిపత్రి రూరల్: పట్టణంలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపాలిటీలోని ఇంజినీరింగ్ కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవితోపాటు పలువురు నాయకులు దీక్ష శిబిరం వద్దకు వచ్చి మద్దతు పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మద్దతిచ్చిన వారిలో పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, నాగేంద్ర, అబ్రహం, నాగార్జున తదితరులున్నారు.

ప్రజా ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తహసీల్దారు రాము తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఆయాశాఖల అధికారులు అర్జీలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. అధికారులు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు తహసీల్దారు కార్యాయలంలో ఉండాలన్నారు. గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

వ్యవసాయ కాలువల్లోకి మురుగు!

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- పట్టించుకోని అధికారులు

పామిడి: పట్టణంలోని మురుగు నీరంతా వ్యవసాయ కాలువల్లోకి చేరుతూ ప్రజారోగ్యానికి ప్రమాదం పొంచి ఉంది. వివరాలు.. పామిడిలో గంగిరెడ్డి కాలువ, పెద్దకాలువ, పులుసు కాలువ, పెన్నానది పిల్ల కాలువలు వ్యవసాయ కాలువలు. ఈ కాలువల కింద గతంలో రైతులు వేల ఎకరాల్లో పంటలు సాగుచేసుకుని జీవనం సాగించేవారు. స్థానిక మార్కెట్ వీధి గుండా గంగిరెడ్డి కాలువ, నెహ్రూనగర్ గుండా పెద్దకాలువ, బీసీ కాలనీగుండా పులుసు కాలువ, పామిడి పెన్నానది నుంచి పశువైద్యశాల గుండా పిల్ల కాలువ ప్రవహించేవి. ఈ కాలువ నీరంతా బైపాస్ అవతలి వైపున్న వేల ఎకరాలకు సాగునీరు అందించేవి. పామిడిలోని డ్రైనేజీ నీరంతా ప్రస్తుతం ఈ కాలువలు గుండా ప్రవహిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక నెహ్రూకాలనీ, చుట్టుపక్కల కాలనీలు, 40 ఫీట్ రోడ్డులో రహదారుల ఏర్పాటుతో పాటు డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా డ్రైనేజీ కాలువల నిర్మాణంపై దృష్టి సారించక పోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పామిడిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వర్షం వస్తే డ్రైనేజీ నీరంతా పొంగిపొర్లి డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో కాలనీల్లో మురుగునీరు నిల్వ ఉంటోంది. ప్రస్తుతం డ్రైనేజీ కాలువలు నిర్మాణానికి నోచుకోకపోవడంతో కాలనీల్లోని డ్రైనేజీ నీరంతా వ్యవసాయ కాలువల్లోకి వదులుతున్నారు. దీంతో వ్యవసాయ కాలువలు చెత్తాచెదారంతో నిండి మురికి కూపాలుగా మారాయి. తద్వారా ఇవి దోమలకు నిలయాలయ్యాయి. దీంతో పామిడి పట్టణ ప్రజలకు సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం స్పందించి డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరముందని స్థానికులు కోరుతున్నారు.



మురుగుతో నిండిన పెన్నానది పిల్ల కాలువ



పామిడిలో అధ్వానంగా పెద్ద కాలువ



మురికికూపంగా పులుసు కాలువ



గంగిరెడ్డి కాలువ దుస్థితి ఇలా..

'రీ కాలింగ్' విజయవంతం చేయండి

యాడికి: తాడిపత్రిలో ఈ నెల 15న నిర్వహించనున్న రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, సీనియర్ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానంద రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి తాడిపత్రి సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి, పార్ల మెంట్ నియోజకవర్గ పరిశీలకుడు నరేష్‌రెడ్డితో పాటు జిల్లాలోని నియోజక వర్గ నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు .

పుట్లూరు: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.మహేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు కల్లూరులో..

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిలో స్టార్ ఫంక్షన్ హాల్లో మంగళవారం రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆదేశాలు మేరకు కల్లూరులో మధ్యాహ్నం 3 గంటలకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అను బంధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్య కర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు మృగ్యం



మాట్లాడుతున్న బీ మోహన్‌నాయక్

పామిడి: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ, గురుకుల పాఠశాలలతో పాటు హాస్టళ్లల్లో మౌలిక వసతులు మృగ్యమైయ్యాయంటూ హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రహరీలు, తరగతి గదులు, డైనింగ్ హాల్, స్నానపు గదులు, నీటి సౌకర్యం తదితర మౌలిక వసతులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రహరీలు లేక పశువులు, విషపురుగుల వల్ల విద్యార్థులకు ప్రాణ హాని లేకపోలేదన్నారు. హాస్టళ్లకు సంక్షేమాధికారుల కొరత పీడిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించని పక్షాన ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, భాస్కర్, చంటిబాబు, ధరణికుమార్, గోపి, మణికంఠ, రమణ, రాజశేఖర్ రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



జయప్రసాద్‌రావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని సీఎస్ఐ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు బుడ్డా జయ ప్రసాద రావును ఆదివారం మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న ముస్లిం షాదీఖానాలో ఎంఈఓ కాశెప్ప, టీచర్లు, బంధువులు, గ్రామ ప్రజలు, ఘనంగా సత్కరించారు. 29 సంవత్సరాలపాటు ఒకే పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందడం ఆనందంగా ఉందని జయప్రసాద్ రావు తెలిపారు. అనంతరం బుడ్డా జయప్రసాదరావు, యాడికి నం:2 పాఠశాల టీచర్ ఇందిర దంపతులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పెద్దన్న, డేనియల్, శ్రీ వాస్తవ రెడ్డి, ఏపీటీఎఫ్ డేనియల్, ఉపాధ్యాయులు శ్రీనివాసయాదవ్, నబిరసూల్, ఆంజనేయులు, జయరామిరెడ్డి, మారుతి, సర్వేశ్వర రెడ్డి, సారమ్మ, భారతి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ షాపులో చోరీ

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న ఓ ఆటో విభాగాల మెకానిక్ షాపులో చోరీ జరిగింది. ఆదివారం తెల్లవారు జామున దొంగలు మెకానిక్ షాపు షట్టర్‌ను ఓపెన్ చేసి లోపలికి ప్రవేశించారు. దుకాణంలో ఉన్న సుమారు రూ. 50 వేల విలువైన రెండు బ్యాటరీలు, అడాప్టర్‌తో పాటు కొన్ని ఎలక్ట్రికల్ పరికరాలు ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో ఆదివారం 2000 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి సమావేశమయ్యారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. వారికి విద్యాబోధన చేసి దిశానిర్దేశం చేసిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కంట్రోల్ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న రైల్వే బోర్డు మెంబర్ విజయప్రతాప్‌సింగ్

గుంతకల్లు: స్థానిక డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలోని కంట్రోల్ భవనాన్ని ఆదివారం రైల్వే బోర్డు మెంబర్ (ట్రాక్షన్) విజయ్‌ప్రతాప్ సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ కార్యాలయ భవనంలోని కంట్రోల్ బోర్డులు, కమ్యూనికేషన్ సిస్టం, తదతర వాటి పరిశీలించి, పనితీరుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ రైళ్ల రాకపోకల సమయంలో ఎటువంటి అటుపోట్లు ఎదురైనా తొలుత సమాచారం అందేది కంట్రోల్ కార్యాలయానకే అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాతో భేటీ అయ్యారు. విజయ్‌ప్రతాప్ సింగ్ గుంతకల్లు డివిజన్ అభివృద్ధితోపాటు స్థానిక రైల్వే జంక్షన్, నూతన కంట్రోల్ భవనం, ఉద్యోగుల కోసం చేసిన సేవలను డీఆర్‌ఎం సీఎస్ గుప్తా గుర్తు చేసి ఆయన్ను పూలమాలలు, శాలవాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ అపహరణ

గుంతకల్లు: పట్టణంలోని తిలక్‌నగర్‌లోని మదీనా మసీద్ లైన్‌లో శనివారం అర్ధరాత్రి ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనంలో పెట్రోల్‌ను అపహరణకు గురైంది. ప్రెటోల్ చోరీ చేస్తున్న దృశ్యాలు ఇంటి ముందు ఉంచిన సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. ఈ లైన్‌లోని బాషా తన ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనం ట్యాంకర్ కింద ఉన్న పెట్రోల్ పైపును కట్ చేసిన ఆ ఆగంతకుడు బాటిళ్లలో పెట్రోల్ నింపుకుని అక్కడ నుంచి ఉడయించాడు. ఉదయాన్నే లేచి చూసిన బాషా తన ద్విచక్రవాహనం పెట్రోల్ పైప్ కట్ కావడం చూసి ట్యాంకులోని పెట్రోల్ చెక్ చేసుకుంటే ఖాళీగా ఉంది. దీంతో బాషా ఇంటి ఎదురుగా ఉన్న సీసీ కెమెరాల్లో చెక్ చేయగా అసలు విషయం బయటపడింది. ఇలాంటి ఘటనలు ఈ ఏరియాలో తరుచూ జరుగుతున్నాయన్నారు. పోలీసులు రాత్రి పూట గస్తీ పెంచాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

బొమ్మలాటపల్లిలో వైద్య శిబిరం

బుక్కరాయసముద్రం: మండలంలోని బొమ్మలాటపల్లిలో అక్కినేని నాగార్జున అభిమానులు ఆదివారం ఎస్వీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమ్, డాక్టర్ రేష్మా ఖతీబ్, డాక్టర్ వలి, విజయాస్, నాగార్జున ఫ్యాన్స్ శ్రీరాములు, రమేష్, అస్లాం, రాజ్‌బాబు, నరసింహ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ పోస్టాఫీసు మార్పు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని రామచంద్ర లాడ్జి వెనుక ఉన్న హెడ్ పోస్టాఫీసును లతా లాడ్జి వెనుక ప్రాంతానికి మార్చారు. కార్యాలయ మార్పును ఖాతాదారులు గమనించాలని అధికారులు సూచించారు.



కొట్టాలపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



దిమ్మగుడిలో జలధికి తరలివెళ్తున్న పీర్ల స్వాములు

జలధికి తరలిన పీర్లు

పెద్దపప్పూరు: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని కొట్టాలపల్లిలో గ్రామస్తులు పీర్లను ఊరేగించారు. కోర్కెలు నెరవేరిన భక్తులు చిన్నబాదుల్లా, పెద్దబాదుల్లా స్వాములకు చక్కెర, బెల్లంలతో పాటు వెండి గొడుగులను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధికి తరలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

దిమ్మగుడిలో ..

పెద్దవడుగూరు: మండలంలోని దిమ్మగుడి గ్రామంలో 30 ఏళ్ల తరువాత నిర్వహించిన మొహర్రం వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున గ్రామంలో పీర్ల నుఊరేగించారు. సాయంత్రం స్వాములు అగ్ని గుండ ప్రవేశం చేసి, జలధికి తరలివెళ్లాయి. వారం రోజులుగా పోలీసులు చేసిన కృషిని గ్రామ పెద్దలు కొనియాడుతూ సిఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులును ఘనంగా సన్మానించారు.

పూలకుంటలో కొలువుదీరిన కుళ్లాయిస్వామి

గుత్తి రూరల్: మండలంలోని పూలకుంట గ్రామంలో చిన్న పీర్ల పండుగ సందర్భంగా కుళ్లాయి స్వామి పీరు కొలువు దీరింది. ఈ సందర్భంగా ఆదివారం మకాన్‌లో పీర్ల స్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు స్వామికి చక్కెర చదివించారు. మకాన్‌లో ముజావర్లు స్వామికి ఫాతేహాలు చేశారు.



పూలకుంటలో పీర్ల స్వాములు

ఈ నెల 17న చిన్న సరిగెత్తు, 18న విడిది దినం, 19న పెద్ద సరిగెత్తు, 20న పీరును జలధీకి తరలిస్తామని సర్పంచ్ నగరూరు సుమలత తెలిపారు.

రోడ్డంతా గుంతలమయం



గుత్తి పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో గుంత

గుత్తి: గుత్తి పట్టణంలోని గుంతకల్లు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గాంధీ సర్కిల్ వద్ద నుంచి బ్రిడ్జి వరకూ రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. గుంతల్లో వాహనాలు వెళ్లలేక డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కేతిరెడ్డి పెద్దారెడ్డికి సన్మానం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సత్కరిస్తున్న పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జిలాన్‌బాషా

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జిలాన్ బాషా ఆదివారం కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆయన స్వగ్రామం తిమ్మంపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన తన మీద నమ్మకంతో పార్టీలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నియమించినందుకు ఆయన్ను శాలువాతో సత్కరించారు. తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పేరం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో ఆయుష్య హోమం



ఆయుష్య హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయుష్య హోమాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులోని రాణిపేట్ నుంచి గుల్బర్గాకు చర్మాల లోడుతో వెళ్తున్న లారీ.. ముందు వెళ్తున్న బస్సు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రంలోని చిదంబరానికి చెందిన లారీ డ్రైవర్ రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

22న టెంకాయలు, తలనీలాల హక్కులకు వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, తలనీలాల సేకరించు హక్కు, కొబ్బరి చిప్పల సేకరణ, హోటల్ నిర్వహణ హక్కు కోసం ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహించునట్లు ఈఓ సుబ్రమణ్యం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాఘ మాసం మినహా విడిదినాల్లో మాత్రమే వాటికి హక్కు ఉంటుందన్నారు. టెంకాయలు, తలనీలాల వేలంలో పాల్గొను వారు రూ.50,000, కొబ్బరి చిప్పల సేకరణ, హోటల్ నిర్వహణ వేలలో పాల్గొను వారు.రూ.10,000 డిపాజిట్ చెల్లించాలన్నారు.